క్లుప్తంగా

ఈద్గా స్థలంలో నిర్మించిన షెడ్‌లను తొలగించాలి

లక్ష్మీపురం: నగరంలోని కలెక్టరేట్ రోడ్డు నగరంపాలెం, ఆస్టర్ రమేష్ హాస్పిటల్ పక్కన ఉన్న ఈద్గా స్థలంలో అక్రమంగా రేకుల షెడ్డు నిర్మాణాన్ని తొలగించాలంటూ ప్రజా సేవ సమితి పార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ రహీమ్ బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ విషయంపై అధికారులకు ఫిర్యాదు చేయడంతో స్పందించిన అధికారులకు అక్రమ నిర్మాణాన్ని కూల్చి వేయమని వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్ ఆదేశించారు. అయినా ఇంత వరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై ఆవేదన వ్యక్తం చేశారు.

వేటూరికి నివాళి



లక్ష్మీపురం: వేటూరి సుందరరామమూర్తి ఎన్నో తెలుగు సినీ గీతాలు రాసిన గొప్ప అక్షర రుషి అని తెలుగు సినీ కవి సార్వభౌముడిగా ఆయన కీర్తి గడించారని సంగీత విద్వాంసులు గాయకులు వి.ఎస్.ఎన్.మల్లేశ్వరరావు అన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో బుధవారం సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఆధ్వర్యంలో వేటూరి సుందరరామమూర్తి జయంతి ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన చిత్ర పటానికి పూల మాలలతో నివాళులర్పించారు. అవగాహన సాంస్కృతిక కార్యక్రమాల కో ఆర్డినేటర్ బిళ్ళ అశోక్ మాట్లాడారు.

ప్రగతి నగర్‌వాసులకు పట్టాలివ్వాలి

లక్ష్మీపురం: ప్రగతినగర్‌కు చెందిన పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. సీపీఐ నాయకులు బుధవారం ప్రగతినగర్‌ను సందర్శించారు. ఆయన మాట్లాడుతూ 2007లో పాత గుంటూరు భూ పోరాట కేంద్రం ఏర్పాటు చేసి సుమారు రెండు వేల కుటుంబాలు నివాసాలు ఉండేలా పోరాటలు చేసినట్లు తెలిపారు. ప్రతి ఒక్క పేదవానికి సొంత ఇంటి కల నెరవేర్చాలన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా నివాసం ఉంటున్న వారికి అక్కడే పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కన్వీనర్ నూతలపాటి వెంకటేశ్వరరావు అప్పమ్మ, ఏసు ఎలిసా రావులమ్మ, ఖాజాబీ, ముంతాజ్, అంకమ్మ పాల్గొన్నారు.

పాఠశాలలను బలోపేతం చేయాలి

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యాశాఖ ప్రతి గ్రామంలో ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదించిన మోడల్ ప్రైమరీ పాఠశాల వ్యవస్థ పాఠశాలలను బలోపేతం చేయడం మినహా, నిర్వీర్యం చేసేలా ఉండరాదని ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి.పెదబాబు, డీకే సుబ్బారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి గ్రామ పంచాయతీలో 60 మంది విద్యార్థులు ఉన్నచోట ఒక మోడల్ ప్రైమరీ పాఠశాల, మిగిలిన పాఠశాలల్లోని 3,4,5 తరగతులను మోడల్ స్కూల్లో విలీనం చేసి, సదరు పాఠశాలను ఫౌండేషన్ స్కూల్‌గా మార్చడం వలన విద్యార్థులు డ్రాపౌట్లుగా మారే అవకాశం ఉన్న దృష్ట్యా, ఈ విధాన్ని వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. 60 మంది విద్యార్థుల ఉన్న పాఠశాలను మోడల్ స్కూల్‌గా మారుస్తూ మిగిలిన పాఠశాలలను బేసిక్ స్కూల్స్ గానే కొనసాగించాలని, ఫౌండేషన్ స్కూల్స్ ను పూర్తిగా రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

బాలుడి అదృశ్యం



దానియల్

లక్ష్మీపురం: మతిస్థిమితం లేని యువకుడి అదృశ్యంపై నగరంపాలెం పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. వివరాలు.. కృష్ణబాబు కాలనీకి చెందిన మిద్ద పొగు లాజర్ మిర్చి యార్డులో వాచ్‌మెన్‌గా పని చేసుకుంటూ జీవనం సాగిస్తుంటాడు. కొడుకు అశోక్, కోడలు ఇద్దరు లేని కారణంగా మనవడు మిద్ద పొగు దానియల్‌ను తాతాయ్య లాజర్ పోషిస్తున్నాడు. దానియల్‌కు పుట్టుక నుంచే మతిస్థిమితం లేని కారణంగా చికిత్స చేయిస్తున్నాడు. దానియల్‌కు సుమారు 15 సంవత్సరాలు ఉంటాయి. అయితే మంగళవారం ఇంట్లో నుంచి బయటకు వెళ్ళిన దానియల్ తిరిగి ఇంటికి చేరుకోలేదు. దీంతో లాజర్ చుట్టు పక్కల, బంధుమిత్రుల నివాసాలలో విచారించగా ఎంతకు జాడ తెలియక పోవడంతో నగరంపాలెం పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. దానియల్ ఆచూకి తెలిసిన వారు నగరంపాలెం ఎస్ఐ సలాం 9885054785 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం తెలియజేయాల్సిందిగా కోరారు.

నేడు మాంసం విక్రయాలు నిషేధం

నెహ్రూనగర్: మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా గురువారం గుంటూరు నగరంలో మాంసం దుకాణాల్లో విక్రయాలు నిలిపివేయాలని, నగరపాలక సంస్థ ప్రజారోగ్య అధికారులు వార్డుల వారీగా నిషేధాన్ని పటిష్టంగా అమలు చేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు బుధవారం ఒక ప్రకటనలో కోరారు. మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా మాంసం విక్రయాలు నిషేధం అమలు ఉంటుందని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. వార్డుల వారీగా ప్రజారోగ్య అధికారులు నగరంలో మాంసం విక్రయాలు జరగకుండా పటిష్ట పర్యవేక్షణ చేయడానికి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

అంతా గప్..చుప్

- డెప్యూటేషన్లు రద్దు చేయాలని కమిషనర్ ఆదేశం
- ముడుపులు ఇచ్చుకున్న వారికి కొనసాగుతున్న డెప్యూటేషన్లు
- నగరపాలక సంస్థ ప్రజారోగ్య విభాగంలో పరిస్థితి ఇదీ..



నగరపాలక సంస్థ కార్యాలయంలోని ప్రజారోగ్య విభాగం

నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో మెరుగైన పారిశుద్ధ్యం కోసం 23 డివిజన్లు ఉన్న శానిటరీ వార్డులను 32 డివిజన్లు మార్చారు. దీంతో పాటు నగరపాలక సంస్థ ప్రజారోగ్య విభాగంలో వర్కర్లు చేరి ఆ తరువాత వివిధ విభాగాల్లో డెప్యూటేషన్ చేరిన వారిని కూడా తిరిగి వర్కర్లుగా విధులు నిర్వహించాలని గత సంవత్సరం డిసెంబర్ 12న సీఎంఓహెచ్ డాక్టర్ శోభా రాణి ఉత్తర్వులు జారీ చేశారు. అయితే ప్రక్రియ ప్రణాళిక బద్ధంగా చేసే క్రమంలో శోభారాణి బదిలీపై వెళ్లిపోయారు. దీంతో సదరు ప్రక్రియ మళ్లీ మరుగున పడింది. కొత్తగా సీఎంఓహెచ్‌గా డాక్టర్ అమృతం వచ్చినా ఆమె ఈ విషయాలు చెప్పకుండా శానిటరీ సూపర్‌వైజర్లు(ఎస్ఎస్‌లు) మ్యానేజ్ చేసుకుంటు వస్తున్నారు.

సూపర్‌వైజర్ వద్ద నుంచి డబ్బులు వసూలు

ఆప్కాస్ విధానం రాకముందు గతంలో సొసైటీ వ్యవస్థ ఉండేది. ఈ సొసైటీ కింద వర్కర్లు పనిచేస్తుండేవారు. 15 మందికి వర్కర్లుకు ఒక వర్కర్ సూపర్‌వైజర్‌గా ఉండేలా సొసైటీ కాంట్రాక్టర్ నియమించారు. నగరపాలక సంస్థ పరిధిలో సుమారు 60 మందికిపైగా సూపర్‌వైజర్లు, వర్కర్ సూపర్‌వైజర్లు ఉన్నారు. వీరి పర్యవేక్షణలో పారిశుద్ధ్య పనులు చేస్తుంటారు. సొసైటీ వ్యవస్థ రద్దు అయిపోయి ఆప్కాస్ వచ్చినప్పటికి వీరంతా వర్కర్ సూపర్‌వైజర్లుగా కొనసాగుతున్నారు. గత సీఎంఓహెచ్ వర్కర్ సూపర్‌వైజర్లుగా పనిచేయడం కుదరదని ప్రతి ఒక్కరూ శానిటేషన్ విధులు నిర్వహించాలని స్పష్టమైన ఆదేశాలు ఇవ్వడంతో వర్కర్స్ సూపర్‌వైజర్స్‌కు మింగుడుపడలేదు. కొంత వర్కర్ సూపర్‌వైజర్లు దళారులను పట్టుకుని మనిషికి రూ.30 నుంచి 40వేల దాకా వసూలు చేసి ఉన్నతాధికారులకు ఇవ్వడంతో ఈ ప్రక్రియ నిలిచిపోయిందన్న ఆరోపణలున్నాయి. మరి కొంత మంది శానిటరీ ఇన్‌స్పెక్టర్లను ప్రసన్నం చేసుకున్నవారికి ఆయా వార్డుల్లో వర్కర్‌గా కాకుండా వర్కర్ సూపర్‌వైజర్‌గా పనిచేసుకునే వెసులుబాటు కల్పిస్తున్నారు.

డెప్యూటేషన్ రద్దు కాలేదు

పలు విభాగాల్లో డెప్యూటేషన్లపై పనిచేస్తున్న వారిని తిరిగి శానిటేషన్ వర్కర్లుగా పనిచేయాలని స్పష్టమైన ఆదేశాలున్నా ఇంత వరకు ఎక్కడి వారు అక్కడే డెప్యూటేషన్‌పై విధులు నిర్వహిస్తూనే ఉన్నారు. వీరిలో చాలా మంది డెప్యూటేషన్ రద్దు చేయకుండా ఉండేందుకు భారీ మొత్తంలో ముడుపులు సమర్పించుకున్నట్లు సమాచారం. నగరపాలక సంస్థ కార్యాలయంలో ఉన్నతాధికారులు ఆదేశాలు ఇచ్చిన్నా అవి సక్రమంగా అమలు జరగవని ప్రజారోగ్య విభాగంలో పలువురు బహిరంగంగానే చర్చించుకుంటున్నారు. నగర కమిషనర్ పులి శ్రీనివాసులు మాత్రం తన రోజువారి పర్యటనలో డెప్యూటేషన్లు రద్దు చేశామని చెప్పుతున్నారు.

ఎన్జీరంగా వర్సిటీని సందర్శించిన 'ఫ్లోరిడా' బృందం



ఫ్లోరిడా యూనివర్సిటీ ప్రతినిధులతో ఎన్జీరంగా యూనివర్సిటీ అధికారులు

గుంటూరు రూరల్: నగర శివారుల్లోని లాంఫాం వ్యవసాయ పరిశోధన స్థానంలోని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయాన్ని యూఎస్ఏకు చెందిన ఫ్లోరిడా యూనివర్సిటీ ప్రతినిధుల బృందం బుధవారం సందర్శించింది. వర్సిటీ ఉపకులపతి డాక్టర్ ఆర్.శారదాజయలక్ష్మీదేవి మాట్లాడుతూ ఫ్లోరిడా యూనివర్సిటీకి చెందిన ఐదుగురు ప్రతినిధులు విశ్వవిద్యాలయంలో పర్యటించారన్నారు. వారి దేశంలోని వ్యవసాయ స్థితిగతులు, పంటలు, సాగు సమస్యలు భారతదేశంతో దాదాపు సమానంగా ఉన్నాయని, పరస్పర సహకారంతో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డ్రోన్ల విషయంలో పరిశోధనలు చేయించి విద్యార్థుల మార్పిడి ప్రక్రియపై చర్చించటం జరిగిందన్నారు. విశ్వవిద్యాలయాన్ని సందర్శించిన వారిలో ఫుడ్ అండ్ నేచురల్ రిసోర్స్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ జెస్కాట్ఏం గిల్, డైరెక్టర్ ఆఫ్ గ్లోబల్ ఫుడ్ సిస్టమ్స్ ఎడ్‌టోలాటి ఎడిసన్, అగ్రిబయాలజికల్ ఇంజినీరింగ్ ప్రొఫెసర్ డాక్టర్ విజయగోపాల్ కాకాని, ప్రొఫెసర్ అగ్రిబయాలజికల్ ఇంజనీరింగ్ డాక్టర్ జన్మిత్‌జడ్జ్, గ్లోబల్ ఫుడ్ సిస్టమ్స్ ఇనిస్టిట్యూట్, సాయిల్ వాటర్ ఇకో సిస్టమ్స్ డిపార్ట్‌మెంట్ డాక్టర్ ఆండ్రూజోగ్రామ్‌లు విశ్వవిద్యాలయంలోని డ్రోన్ టెక్నాలజీ విభాగం, పరిశోధన క్షేత్రాలు, పరిశోధన శాలలను సందర్శించారన్నారు. విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ జి.రామచంద్రరావు, ఇంజినీరింగ్ విభాగం డీన్ డాక్టర్ ఎ.వాణి, పరిశోధన సంచాలకుడు డాక్టర్ పీవీ సత్యనారాయణ పాల్గొన్నారు.

విద్యార్థులకు మోడల్ టెస్ట్ పేపర్ బుక్స్ పంపిణీ



పట్నంబజారు: నవసమాజ నిర్మాతలైన విద్యార్థులపై పెట్టే ప్రతి పైసా పెట్టుబడి కూడా భావి భారత నిర్మాణానికి పునాది అవుతుందని స్ఫూర్తి ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి బందా రవీంద్రనాథ్ చెప్పారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం గుంటూరు నగరంలోని భారత్‌పేట, ఆర్ అగ్రహారం, సంజీవయ్యనగర్ మున్సిపల్ పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ఎస్ఎస్‌సీ న్యూ మోడల్ టెస్ట్ పేపర్ - 2025 పుస్తకాన్ని బుధవారం ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రవీంద్రనాథ్ మాట్లాడుతూ ప్రతి ఒక్క విద్యార్థి విధిగా చదువుకోవాల్సిన ఆవశ్యకతను గుర్తెరిగి మసలుకోవాలని సూచించారు. కార్యక్రమంలో భారత్‌పేట స్కూల్ హెచ్ఎం సుజాత, ఆర్ అగ్రహారం స్కూల్ హెచ్ఎం శ్రీనివాసరెడ్డి, సంజీవయ్యనగర్ హెచ్ఎం ప్రమీల, ఫౌండేషన్ ప్రతినిధులు గంగాధరరెడ్డి, సంజీవరెడ్డి, పుల్లారెడ్డి పాల్గొన్నారు.

20 ప్లస్.. అయితే ఆరోగ్యం జాగ్రత్త

- జిల్లాలో కొత్తగా 1,431 మందికి అధిక రక్తపోటు నిర్ధారణ
- కొత్తగా షుగర్ బాధితులు 1,552 మంది
- ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలంటున్న వైద్య నిపుణులు
- ఎన్‌సీడీ 3.0 సర్వే

పొంచిఉన్న బీపీ, షుగర్ ముప్పు



జిల్లాలో 18 ఏళ్లు దాటిన వారు	17,19,054
స్క్రీనింగ్ పరీక్షలు	2,22,010
బీపీ నిర్ధారణ	1,431
షుగర్	1,552

గుంటూరు మెడికల్: ఆధునిక జీవన శైలి యువత రోగాల బారిన పడేస్తోంది. వ్యాధులు నిర్ణీత వయస్సు కంటే ముందస్తుగానే దాడిచేస్తున్నాయి. వాతావరణ కాలుష్యంతోపాటుగా ఒత్తిడితో కూడిన జీవితం కారణంగా భావిస్తున్నారు. చిన్న వయస్సులోనే వ్యాధుల బారిన పడుతున్నారు. ప్రజలు వ్యాధుల బారినపడకుండా కొద్దిపాటి అవగాహన కలిగిఉండి ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యనిపుణులు సూచిస్తున్నారు.


ఎన్‌సీడీ 3.0 సర్వేలో వెలుగులోకి...

జిల్లాలో నాన్ కమ్యూనికబుల్ డిసీజెస్(ఎన్‌సీడీ) 3.0 కార్యక్రమాన్ని 2024 నవంబర్ 14 ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా 18 ఏళ్లు దాటిన వారికి వైద్య సిబ్బంది ఇళ్ల వద్దకే వెళ్లి బీపీ, షుగర్, క్యాన్సర్ వ్యాధి నిర్ధారణ పరీక్షలు ఉచితంగా చేస్తున్నారు.

గత ఏడాదితో పోలిస్తే..

గత ఏడాది జరిగిన ఎన్‌సీడీ కార్యక్రమంలో జిల్లాలో 8,859 మంది కొత్తగా అధిక రక్తపోటు బారిన పడగా 5,932 మంది షుగర్ వ్యాధి బారిన పడ్డారు. కొత్తగా వ్యాధి బారిన వారే కాకుండా జిల్లాలో 14,688 మంది అధికరక్తపోటు బాధితులు, 12,690 మంది షుగర్ వ్యాధి బాధితులు చికిత్స తీసుకుంటున్నట్లు సర్వేలో నిర్ధారించారు. ఎక్కువ సంఖ్యలో షుగర్, బీపీ బాధితులు సర్వేలో నమోదు అవ్వటంతో జిల్లా వైద్యాధికారులు, వైద్య నిపుణులు ఆందోళన వ్యక్తం చేసి అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. ముందస్తు వైద్య పరీక్షలు చేయించుకోవడంతోపాటు, వ్యాధుల పట్ల అవగాహన కలిగి ఉండి కొద్దిపాటి జాగ్రత్తలు తీసుకోవాలనే విషయాన్ని ఆయా గ్రామాల్లో సర్వే చేస్తున్న వైద్య సిబ్బంది గ్రామీణులకు వివరించి వ్యాధి బాధితులకు మెరుగైన వైద్య సేవల కోసం ఆరోగ్య కేంద్రాలకు రిఫర్ చేశారు.

హైరిస్క్‌వారు జాగ్రత్తగా ఉండాలి...



బీపీ, షుగర్ ఉన్నవాళ్ళు హైరిస్క్ గ్రూప్‌కు చెందిన వారు. వీరి కిడ్నీ జబ్బుల బారిన పడే అవకాశం చాలా ఎక్కువ. షుగర్ వచ్చిన ఏడు నుంచి పదేళ్లలో కిడ్నీలు పాడవుతాయి. ఊబకాయం(అధికబరువు) ఉన్నవారు కిడ్నీ జబ్బున పడే ప్రమాదం ఉంది. జీనవశైలిలో వచ్చిన మార్పుల వల్ల ప్రస్తుతం 20 ఏళ్ల దాటిన ప్రతి 10 మందిలో ఒకరు కిడ్నీ జబ్బు బారిన పడుతున్నారు. బీపీ, షుగర్ ఉన్నవాళ్ళు తప్పనిసరిగా కిడ్నీ పరీక్షలు చేయించుకోవాలి. వయస్సు మీద పడేకొద్ది సహజంగా మూత్ర సంబంధిత సమస్యలు వస్తాయి. వాటిని సకాలంలో గుర్తించకపోతే కిడ్నీలు పాడయ్యే ప్రమాదం ఉంది.

–డాక్టర్ చింతా రామకృష్ణ, సీనియర్ నెఫ్రాలజిస్ట్, గుంటూరు.

జాగ్రత్తలు తీసుకుంటే షుగర్ అదుపు



షుగర్ వ్యాధి ఉందా లేదా అని ముందస్తుగా తెలుసుకోవటానికి హెచ్‌బీఏ1సీ పరీక్ష చేయించుకుంటే తెలుస్తుంది. ఉదయాన్నే పరగడుపున ఏమీ తినకుండా, తాగకుండా షుగర్ వ్యాధి నిర్ధారణ పరీక్ష చేయించినప్పుడు రక్తంలో షుగర్ 100లోపు ఉంటే షుగర్ వ్యాధి లేనట్లే. షుగర్ 100 నుంచి 126లోపు ఉంటే ప్రీ డయాబెటిక్ దశలో ఉన్నట్లు లెక్క. అంటే ఇప్పుడే షుగర్ వ్యాధి శరీరంలోకి ప్రవేశించటానికి సిద్ధమవుతుంది. ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటే షుగర్ వ్యాధి సోకదు. కుటుంబంలో ఒకరికి ఉంటే ఇతర కుటుంబ సభ్యులు ముందస్తుగా వైద్య పరీక్షలు చేయించుకోవటం ద్వారా వ్యాధి బారిన పడకుండా జాగ్రత్తపడొచ్చు.

–డాక్టర్ కోగంటి కళ్యాణ్‌చక్రవరి, ఇన్‌ఫెక్షన్స్ స్పెషలిస్ట్, గుంటూరు.

మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలి

కమిషనర్ శ్రీనివాసులు



రాజీవ్‌గృహకల్పను పరిశీలించి సిబ్బందితో చర్చిస్తున్న కమిషనర్

గుంటూరు రూరల్: నగరపాలక సంస్థ పరిధిలోని చౌడవరం రాజీవ్ గృహకల్ప ప్రాంతంలో మౌలిక వసతులను కల్పించడానికి తగిన చర్యలు తీసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు, ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. బుధవారం రాజీవ్ గృహకల్ప ప్రాంతంలో తాగునీటి సరఫరా, పారిశుద్ధ్య పనులు పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రాజీవ్ గృహకల్పలో నివసించే ప్రజలకు నగరపాలక సంస్థ నుంచి మౌలిక వసతులు కల్పించాలన్నారు. గృహకల్ప బ్లాక్‌ల పరిసరాల్లో పిచ్చి మొక్కలు పెరిగి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, 2 రోజుల్లో చుట్టూ ఉన్న పొదలు తొలగించాలని, ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. గృహకల్ప ప్రాంతంలోని బోర్లు మరమ్మతులు చేయాలని, అవసరమైతే నూతన మోటార్ల కొనుగోలుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. గృహకల్ప నివాసాలకు ఆస్తి పన్ను వేయడానికి చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అధికారిని ఆదేశించారు. ఆయన వెంట డీఈఈ సతీష్, ఏఎంహెచ్ఓ ఆనందకుమార్ ఉన్నారు.

సుందరకాండ హనుమంతుని కార్యదక్షతకు నిదర్శనం



నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై దివంగత ముప్ప వరపు కేశవరావు శత జయంతి సందర్భంగా శ్రీవాల్మీకి మహర్షి ప్రణీత శ్రీమద్రామాయణ ప్రవచన నవాహ జ్ఞానయజ్ఞంలో భాగంగా సమన్వయ సరస్వతి సామవేదం షణ్ముఖశర్మ సుందరకాండపై ప్రవచనం రెండో రోజు కొనసాగింది. ముప్పవరపు వేంకటసింహాచలశాస్త్రి, భారతి ధార్మిక విజ్ఞాన పరిషత్ బొల్లేపల్లి సత్యనారాయణ, ఆలయ పాలకమండలి అధ్యక్ష, కార్యదర్శులు సిహెచ్.మస్తాన య్య, ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం విద్యారణ్య పండితులు, ఘనాపాటి విష్ణుభట్ల లక్ష్మీనారాయణశర్మ, బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మను సత్కరించారు.

సిటీ బస్సులు ఏర్పాటుకు ప్రణాళిక సిద్ధం చేయండి

కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్

లక్ష్మీపురం: నగరంలో ప్రజల అవసరాలకు అనుగుణంగా పబ్లిక్ ట్రాన్స్‌పోర్టు వాహనాలు(సిటీ బస్సులు) ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందించాలని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో అధికారులు, ప్రజాప్రతినిధులతో బుధవారం సమావేశమయ్యారు. సమావేంలో జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు, శాసనసభ్యులు మహ్మద్ నజీర్ అహ్మద్, గల్లా మాధవి, బూర్ల రామాంజనేయులు హాజరయ్యారు. డాక్టర్ పెమ్మసాని మాట్లాడుతూ నగర విస్తరణకు అనుకూలంగా ప్రజల రవాణాను పెంచే అవకాశాలను పరిశీలించాలని కోరారు. నూతన రూట్లపై అనుమతుల కోసం ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపాలని సూచించారు. నూతన రూట్లలో ఈవీ బస్సులను మాత్రమే నడపాలని ప్రైవేటు సిటీ బస్సు ఆపరేటర్లకు సూచించారు. జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న సిటీబస్సు రూట్స్ విస్తరణ అనుమతులు రెండు వారాల్లో జిల్లా రవాణా కమిటీ సమావేశం నిర్వహించి పరిష్కరిస్తామని, నూతన రూట్ల అనుమతుల ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపుతామన్నారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఖాజావలి, జిల్లా ఉప రవాణా కమిషనర్ సీతారామిరెడి, ఆర్టీసీ ఆర్ ఎం కృష్ణకాంత్, ట్రాఫిక్ డీఎస్పీ రమేష్ పాల్గొన్నారు.

ఆర్‌యూబీ పరిశీలన..

సమావేశం అనంతరం డొంకరోడ్డు మూడు వంతెనల వద్ద చేపట్టిన రైల్వే అండర్ బ్రిడ్జ్ పనులను పరిశీలించారు. ఆర్ యూ బీ పనులు ప్రారంభించిన తరువాత నగరపాలక సంస్థ తాగునీటి పైపు లైను లీకులు రావటంతో పనుల జాప్యం జరుగుతోందని రైల్వే అధికారులు, కేంద్ర మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. ఫిబ్రవరి 15వ తేదీ నాటికి రైల్వే పనులు పూర్తి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో రైల్వే ఏడీఆర్ఎం సైమన్, సీపీఎం మనోహర రెడ్డి పాల్గొన్నారు.

డాక్టరేట్ పొందిన పూర్వ విద్యార్థికి సన్మానం



సాంబశివరావును సత్కరిస్తున్న విష్ణువర్ధన్, వరప్రసాదరావు, వెంకట్రావు, శశివర్ధన్

గుంటూరు ఎడ్యుకేషన్: వేలాది మంది విద్యార్థులను సామాజిక స్పృహ కలిగిన సహృదయులుగా తీర్చిదిద్ది ప్రపంచానికి అందించిన ఘనత శ్రీ పాటిబండ్ల సీతారామయ్య ఉన్నత పాఠశాల సొంతమని పాఠశాల కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణు వర్ధన్ పేర్కొన్నారు. గణితశాస్త్రంలో పీహెచ్‌డీ పట్టా పొందిన సీతారామయ్య హైస్కూల్ 2008-09 బ్యాచ్ పూర్వ విద్యార్థి గద్దె సాంబశివరావును లక్ష్మీపురంలోని పాఠశాలలో సత్కరించారు. అనంతరం విష్ణువర్ధన్ మాట్లాడుతూ ఉన్నతాశయాల సాధనలో ఇది ఆరంభమేనని, భవిష్యత్తులో మరిన్ని అత్యున్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. గద్దె సాంబశివరావు మాట్లాడుతూ బాల్య దశలో పాటిబండ్ల సీతారామయ్య ఉన్నత పాఠశాల నాటిన విద్యా బీజాల ఫలితమే తమ ప్రస్తుత ఉన్నతికి కారణమని చెప్పారు. గణితశాస్త్ర అధ్యాపకుడు డాక్టర్ డి.రమేష్ మార్గదర్శకత్వంలో పీహెచ్‌డీ పూర్తి చేసినట్లు చెప్పారు. వివిధ అంతర్జాతీయ పరిశోధనా పత్రికల్లో ఎనిమిది విలువైన పరిశోధనా పత్రాలను ప్రచురించడమే కాక అనేక జాతీయ, అంతర్జాతీయ సమావేశాలలో పాల్గొని పరిశోధనా పత్రాలను సమర్పించినట్లు వివరించారు. కార్యక్రమంలో పాఠశాల పాలకవర్గ సభ్యుడు గింజుపల్లి వరప్రసాదరావు, గద్దె సాంబశివరావు తండ్రి వెంకట్రావు, సోదరుడు సాయి శశివర్ధన్, పాఠశాల పూర్వ విద్యార్థి బెజవాడ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

మోడల్ ప్రైమరీ పాఠశాలల్లో 'ఉర్దూ' విలీనం తగదు



డీఈఓ రేణుకకు వినతి పత్రం అందజేస్తున్న బసవ లింగారావు

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ ఉన్నత పాఠశాలల నుంచి 3,4,5 తరగతులను వెనక్కు పంపుతూ జారీ చేసిన 117 జీవో అమలు నేపథ్యంలో ఏర్పాటు చేస్తున్న మోడల్ ప్రైమరీ పాఠశాలల్లో ఉర్దూ మీడియం విద్యార్థులను విలీనం చేయడం తగదని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె. బసవ లింగారావు, మహమ్మద్ ఖాలీద్ పేర్కొన్నారు. బుధవారం ఆర్జేడీ బి.లింగేశ్వరరెడ్డి, డీఈఓ సీవీ రేణుకకు ఏపీటీఎఫ్ బృందం వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా బసవలింగారావు మాట్లాడుతూ ఉర్దూ పాఠశాల విద్యార్థులను తెలుగు మీడియం పాఠశాలల్లో విలీనం చేయవద్దని ప్రభుత్వం స్పష్టంగా చెప్పినా, కొంత మంది ఎంఈఓలు అత్యుత్సాహంతో ఉర్దూ మీడియం విద్యార్థులను ప్రతిపాదిత తెలుగు మీడియం మోడల్ ప్రైమరీ స్కూళ్లలో కలపాలని ఉపాధ్యాయులపై ఒత్తిడి చేస్తున్న విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వినతిపత్రం అందజేసిన వారిలో సంఘ జిల్లా శాఖ ఉపాధ్యక్షులు పి.నాగశివన్నారాయణ, జిల్లా కార్యదర్శులు ఎస్.మూర్తి, జి.దాస్, నాయకులు శివరామకృష్ణ, సయ్యద్ జహంగీర్, గురుమూర్తి, కిషోర్, కృష్ణారావు ఉన్నారు.

పలువురు నామినేషన్లు ఉపసంహరణ

నెహ్రూ నగర్: గుంటూరు నగరపాలక సంస్థ స్థాయి సంఘం(స్టాండింగ్ కమిటీ) ఎన్నికల్లో భాగంగా 57వ డివిజన్ కార్పొరేటర్ పఠాన్ రిహాన, 19వ వార్డు కార్పొరేటర్ తేలుకుట్ల హనుమాయమ్మ నామినేషన్లు ఉప సంహరించుకున్నట్లు సంస్థ అదనపు కమిషనర్, స్టాండింగ్ కమిటీ ఎన్నికల అధికారి చల్లా ఓబులేసు బుధవారం తెలిపారు. నగరపాలక సంస్థ స్టాండింగ్ కమిటీ ఎన్నికలకు 17 మంది కార్పొరేటర్లు నామినేషన్లు దాఖలు చేశారని, గురువారం మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల ఉప సంహరణ గడువు ఉందన్నారు. అనంతరం తుది అభ్యర్థుల జాబితా ప్రకటిస్తామని పేర్కొన్నారు. ఫిబ్రవరి 3వ తేదీ ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ సమావేశ మందిరంలో ఎన్నికలు జరుగుతాయని తెలిపారు.

జీవవైవిధ్య శాస్త్రంపై విస్తృత పరిశోధనలు జరగాలి



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న రెక్టార్ కె.రత్నషీలామణి

ఏఎన్‌యూ రెక్టార్ రత్న షీలా మణి

ఏఎన్‌యూ: జీవవైవిధ్యంపై విస్తృత పరిశోధనలు అవసరమని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం రెక్టార్ కె.రత్న షీలా మణి అన్నారు. విశ్వవిద్యాలయంలోని జువాలజీ అండ్ ఆక్వా కల్చర్ విభాగాల ఆధ్వర్యంలో 'రీసెంట్ అడ్వాన్సెస్ ఇన్ టాక్సికాలజీ, ఇమ్యునాలజీ, అండ్ బయోడైవర్సిటీ' అనే అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సు బుధవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రెక్టార్ కె.రత్నషీలామణి పాల్గొని సదస్సును ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ పర్యావరణ పరిస్థితులు రోజుకు విషతుల్యంగా మారుతున్నాయని చెప్పారు. వాటిపై పరిశోధకులు పరిశోధనలు చేయాలని పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలని సూచించారు. ఎన్నారై మెడికల్ కళాశాల పల్మనాలజీ విభాగాధిపతి ఆచార్య ఆర్.రామకృష్ణ మాట్లాడుతూ జబ్బులు వచ్చినవారు వాటిని ఎదుర్కొనే విధంగా తగు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రిజిస్ట్రార్ జి.సింహాచలం మాట్లాడుతూ ఇటువంటి సదస్సుల ద్వారా పరిశోధకులు, విద్యార్థులు, వివిధ సంస్థల శాస్త్రవేత్తలు ఇచ్చే సలహాలను పాటించి నూతన పరిశోధనలను అన్వేషించాలని కోరారు. సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ కె.వీరయ్య మాట్లాడుతూ మానవాళి మనుగడకు వాతావరణ కాలుష్యం ముప్పు కలిగించేదిగా ఉంటాయని పేర్కొన్నారు. ఆరోగ్యవంతమైన సమాజం కోసం యువత అడుగులు వేయాలన్నారు. తిరుపతి శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ పూర్వ రెక్టార్ ఆచార్య ఎం.భాస్కర్, సదస్సు డైరెక్టర్ వి.వెంకటరత్నమ్మ మాట్లాడారు. సదస్సులో కో డైరెక్టర్ పి.పద్మావతి, ఆర్గనైజింగ్ సెక్రటరీ జగదీష్ నాయక్, అధ్యాపకులు సుమంత్ కుమార్, పి.వి.కృష్ణ, గోపాలరావు పాల్గొన్నారు.